
రాత్రి 8—30 గంట అయింది.

గోదావరి ఎక్స్‌ప్రెస్ రాజమండ్రి స్టేషన్‌లో ఆగింది. నేను, మూర్తి గబగబ జనరల్ కంపార్ట్‌మెంట్ కోసం వెతుకుతున్నాం. కంపార్టుమెంటు నయితే పట్టుకోగలిగాం కానీ, ఒక్క సీటు కూడా ఖాళీగా లేదు. సినిమా టిక్కెట్లకోసం కుమ్ముకుంటున్నట్లుగా కుమ్ముకుంటున్నారు లోపల పాసెంజర్లు.

అంత రద్దీగా ఉంటే నా కసలు ఊపిరాడనట్టుంటుంది. అందుకే ప్రయాణాన్ని మానుకుందా మనుకున్నాను. మూర్తి మాత్రం ఎలాగో ఒకలా వెళ్ళిపోదామని పట్టుబట్టాడు.



తల్లీ,బిడ్డ (దారుశిల్పం)

—మవి నారాయణ్

నేను, మూర్తి విజయవాడకు చిన్న పనిమీద వెళ్ళవలసి ఉంది. ఆ పని అంత అర్జెంటు కాకపోయినా, ఎండాకాలం రాత్రి ప్రయాణమైతే సుఖంగా ఉంటుందన్న మూర్తి మాటలతో గోదావరికి వెళదామని నిశ్చయించుకున్నాము. ఇంతమంది జనాన్ని చూసిన తరవాత ఏం చేయాలో తోచడం లేదు.

కంపార్ట్‌మెంట్ దగ్గరే నిలబడి 'వెళదామా? వద్దా?' అని తర్జన భర్జన చేసుకుంటున్న సమయంలో గార్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. మూర్తి చేయి పట్టుకుని, "పోదాం పద!" అన్నాను.

"ఎక్కడికి?" అన్నాడు.

"ఇంటికి. అంత కష్టపడి వెళ్ళి వెళ్ళవలసిన పనేముంది?" అన్నాను.

మూర్తి సరేనన్నాడు.

రైలు వెళ్ళిపోయింది.

టికెట్స్ కాన్సిలు చేయడానికి కౌంటర్ దగ్గరికి వెళదా మనుకుంటుండగా, "ఏమండీ! గోదావరి వెళ్ళిపోయిందా?" అంటూ వచ్చింది ఒక అమ్మాయి. ఆ అమ్మాయికి ఇరవై ఏళ్ళు ఉంటాయి. తెల్లగా, పొడవుగా, చక్కని కనుముక్కు తీరుతో చాలా అందంగా ఉంది. కుడి భుజానికి ఎర్రటి హాండ్‌బాగ్ తగిలించుకుంది.

"అరెరె! ఇప్పుడే వెళ్ళిపోయింది. మీరు ఒక్క నిమిషం లేటు. ఇంతకీ మీరు ఎక్కడికి వెళ్ళాలి?" అన్నాను ఆమె వంకే చూస్తూ.

"విజయవాడ" అంది.

"సరిపోయింది. ఇవ్వాళ గోదావరి ఎక్స్‌ప్రెస్ రాజమండ్రి నుంచి ముగ్గుర్ని భారం తగ్గించుకుందన్న మాట" అన్నాను నవ్వుతూ.

"అంటే..." అంది అర్థం కాక.

"మీతోపాటు మేముకూడా తప్పిపోయిన ప్రయాణికులం. కానీ, మీలా ఆలస్యంగా వచ్చి రైలు వదులుకోలేదు. కావాలనే వదులుకున్నాం" అన్నాను.

"ఎందుకు?" అంది ఆశ్చర్యంగా.

"మీ కీ వేళ రైలు తప్పిపోవడమే మంచిదయింది. రిజర్వేషన్ లేకపోతే మాత్రం మీరందులో వచ్చినా ప్రయాణం చేయలేరు" అన్నాను.

"అయితే, ఇప్పు డెలాగ?" అంది నీరసంగా.

"ఇంటికి వెళ్ళండి. లేకపోతే రాత్రి రెండు గంటలకు బస్సు ఉంది. దానిలో వెళ్ళండి" అన్నాను.

మూర్తి నా పక్కనే నిలబడి మౌనంగా వింటున్నాడు. వాడికి ఆడపిల్లలతో మాట్లాడడమంటే భయం. అయినా, నాకు మంచికంపెనీ ఇస్తుంటాడు. మేము మాట్లాడుకుంటూండగా, "ఈ లోగా నేను వెళ్ళి టికెట్స్ కాన్సిలు చేసుకుని వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

వాడు వెళ్ళటమే మంచి దనుకుని ఆ అమ్మాయిని కబుర్లలో పెట్టేశాను.

అయిదు నిమిషాల్లో మూర్తి తిరిగి వచ్చాడు.

ముగ్గురం స్టేషను బయటికి వచ్చాము.

"ఏ సినిమాకు వెళదాం?" అన్నాను ఆ అమ్మాయితో.

"మీ ఇష్టం" అంది.

మూర్తి మా ఇద్దరి వంక ఆశ్చర్యంగా చూడడం గమనించి, "మనం ఎలాగూ ప్రయాణం మానుకున్నాము. ఈ అమ్మాయికి, పాపం! రెండు గంటలవరకూ బస్సు కూడా లేదు. ఈలోగా సినిమాకు వెళితే ఆ అమ్మాయికి కంపెనీ ఇచ్చినట్టుంటుంది. మనం కూడా ఎంజాయ్ చేసినట్టుంటుంది" అన్నాను, ఆ అమ్మాయి చూడకుండా వాడికి కన్ను గీటుతూ.

మూర్తి ఏమీ మాట్లాడలేదు.

వాడి మౌనం చూసి ఆ అమ్మాయి అంది—"మీ ఫ్రెండు చాలా భయస్తుడులా ఉన్నాడే!" అని.

"భయం కాదు. వాడు ఎప్పుడూ అంతే. ఆడవాళ్ళతో ఎక్కువ మాట్లాడడు" అన్నాను నవ్వుతూ.

ఎలాగైతేనేం మూర్తిని సినిమాకు ఒప్పించి బయలుదేరాము.

"ఎండాకాలం కదా? చల్లగా ఉంటుంది. నడిచే వెళదాం!" అంది ఆ అమ్మాయి.

"సరే" అన్నాను.

ముగ్గురం నడుస్తున్నాం.

ఆ అమ్మాయి గడగడ ఏదో మాట్లాడుతూంది.

కొంచెం దూరం వెళ్ళిన తరవాత అన్నాను: "ఇంతకీ ఏ హాలుకి వెళదాం?"

"ఇప్పుడే సినిమాకు ఏం వెళతాం? సినిమా మొదలు పెట్టటానికి ఇంకా చాలా టైముంది కదా? అలా దేవీ నవరాత్రుల పందిళ్ళు చూసి అప్పుడు వెళదాం" అంది చేతికి ఉన్న రిస్ట్ వాచీకేసి చూసుకుంటూ.

"ఓ. కె." అన్నాను. మూర్తికి ఇష్టం లేకపోయినా ఆ అమ్మాయి ఎదురుగా నాతో పోట్లాడ్డం ఇష్టం లేక నా వంక కొరకొర చూసి మమ్మల్ని వెంబడించాడు.

'దేవీ చౌక్' దగ్గరికి వచ్చాము. మామూలుగా అయితే అంతదూరం నడచి రావడం ఎంతో కష్టం అనిపిస్తుంది. అయితే, మాటల్లో పడి నడిచి రావడం వల్ల దూరం తెలియలేదు.

'దేవీ చౌక్' దగ్గర ఒక పందిరిలో సత్య హరిశ్చంద్రుడి నాటకం ఆడుతూంటే వెళ్ళి అక్కడ నిలబడిపోయింది.

నాకు నాటకాలంటే తలనొప్పి.

"ఇక్కడ నిలబడిపోయారేమిటి? సినిమాకు టైమవుతోంది కదా? రండి, వెళదాం" అన్నాను.

"ఒక్క అయిదు నిమిషాలు చూసి వస్తాను!" అంది జనాన్ని తప్పించుకుని ముందుకు వెళుతూ.

అన్నట్టుగానే అయిదు నిమిషాల్లో బయటికి వచ్చి, "పదండి" అంది.

"ఏ హాలుకి?" అన్నాను.

"అప్సరాకి" అంది.

"అయితే, ఇటు నడవండి" అన్నాను, ముందుకు దారి తీస్తూ.

"అటెందుకు? ఈ సందులోంచి వెళదాం. ఇటు దగ్గర దారి" అంది ఒక సందు చూపిస్తూ.

మూర్తి సందేహిస్తూ నా వైపు చూశాడు. ఫరవాలేదన్నట్టు సైగ చేశాను. ఆ సందంతా ఇరుకుగానూ, చీకటిగానూ ఉంది. అటువైపున ఒక్క మనిషి కూడా నడవడం లేదు. మూసేసిన కొట్ల అరుగుల మీద ఒకరిద్దరు బిచ్చగాళ్ళు పడుకుని నిద్రపోతున్నారు. ఆమె వేగంగా నడుచుకుంటూనే వెళ్ళిపోతూంది. మేము కూడా ఆమెను వేగంగానే వెంబడిస్తున్నాము.

సందు మలుపు తిరిగే సమయానికి ఆమె మెరుపులా మాయమైంది. అటూ, ఇటూ వెదుకుతున్నాం ఆమెకోసం. ఇంతలో ముగ్గురు బలమైన వ్యక్తులు అకస్మాత్తుగా మా ముందుకు ఉరికారు. ముగ్గురు పొట్టిగా, లావుగా, కండలు తిరిగి ఎలుగుబంట్లలా ఉన్నారు.

"అల్లరి చేయకుండా మీ చేత నున్న వాచీలు, మీ జేబులో ఉన్న డబ్బు ఇచ్చేసి బుద్ధిగా వెళ్ళిపొండి" అన్నారు, పదునైన చాకులు తీసి చూపుతూ.

# పిట్టల మీద కన్ను

—బీరరాజు




ఆవాక్కయిపోయాము.

చేతివాచీ తీసి, పర్సుకోసం జేబులో చేయి పెట్టాను, తీద్దామా వద్దా? అని.

"ఊ. త్వరగా తీయ్!" అన్న వారి మాటలతో పర్సు తీసి, వాచీ, పర్సు కలిపి వాడి చేతిలో పెట్టుతూ బలంగా ఒక్క తావు తన్నాను. ఈ మెరుపు దాడికి ఒకళ్ళమీద ఒకళ్ళు తూలి పడిపోయారు. వాళ్ళ చేతుల్లోని పదునైన చాకులు దూరంగా ఎగిరి పడ్డాయి. ఈ అదను చూసి మూర్తి కూడా ధైర్యం చేసి మూడవ వాడి మీద దాడి ప్రారంభించాడు.

ఇద్దరమూ ముగ్గురితో పెనుగులాడుతున్నాము. ఈ పెనుగులాటలో ఒకడికి గట్టిగా దెబ్బ తగలడంతో 'అమ్మా' అని గట్టిగా అరిచి పారిపోవడం మొదలెట్టాడు. ఎప్పుడయితే ఒకడు పారిపోవడం చూశారో మిగతా ఇద్దరు కూడా ఒక్కసారిగా మమ్మల్ని తోసేసి పారిపోవడం మొదలు పెట్టారు.

పారిపోతున్న వాళ్ళని చూసి, "కాచ్ దెమ్" అంటూ గట్టిగా అరిచాను.

మఫ్టీలో ఉన్న పోలీసులు వచ్చి వాళ్ళని అరెస్టు చేశారు.

"వీళ్ళ ముగ్గుర్నీ 'లాకప్'లో పడేయండి. ఉదయం వచ్చి వీళ్ళ పని చూస్తాను" అన్నాను.

"ఎస్, సార్" అంటూ సెల్యూట్ చేసి వెళ్ళిపోయారు కానిస్టేబుల్స్.

"పద! సినిమాకు టైమవుతూంది" అన్నాను మూర్తి భుజం తట్టి.

"మొత్తంమీద ఎస్. ఐ. వి అనిపించుకున్నావ్!" అన్నాడు.

నేను చిరునవ్వు నవ్వుతూంటే, "అసలు ఆ అమ్మాయి మీద నీ కెలా అనుమానం వచ్చింది?" అన్నాడు.

"ఏముంది? ఆ అమ్మాయి స్టేషన్‌లోకి వచ్చి ట్రెయిన్ వెళ్ళిపోయిందా అని అడిగినప్పుడు, మామూలుగా రైలు తప్పిపోయిన ప్రయాణీకురాలి ఆత్రుత కనబడలేదు ఆమెలో. పైగా ఆమె టికెట్ గానీ తీసుకుని ఉంటే నువ్వు టికెట్స్ 'కాన్సిలేషను'కి వెళ్ళినప్పుడు తను కూడా నీ వెంబడి వచ్చేది. అదీకాక, తనంతట తానే అంది— 'ఇప్పుడేం ఇంటికి వెళతాం! సినిమాకు వెళితే బాగుంటుంది'అని. ఆడపిల్ల అర్ధరాత్రి తనంతట తానుగా ముక్కూ, మొహం తెలియని వ్యక్తి దగ్గరికి వచ్చి, 'సినిమాకి వెళదాం, పద' అని ధైర్యంగా అన్నదంటే ఆది 'ప్రాస్టిట్యూట్' అయినా అయి ఉండాలి, లేకపోతే ఇదిగో, ఇటువంటి దొంగ అయినా అయి ఉండాలి" అన్నాను నవ్వుతూ.

"అయినా, అది తప్పించుకుని పారిపోయింది కదా" అన్నాడు.

"ఎక్కడికి పోతుంది? రేపు ఉదయానికల్లా నా స్టేషన్‌లో ఉండదూ? ఇక్కడ జాయిన్ అయిన కొత్తలోనే తెలిసింది—ఒక అందమైన పడుచు జనాల్ని రాత్రి పూట కవ్వించి అందంగా దోచుకుంటూందని. అప్పటి నుంచి ఇటువంటి పిట్టల మీద ఒక కన్నేసి ఉంచాను. పాపం! నేను మఫ్టీలో ఉన్న సబ్—ఇన్‌స్పెక్టర్నని తెలియదు. తెలిసి ఉంటే నా వలలో చిక్కక పోను. ఐ పిటీ హెర్!" అన్నాను, కించిత్తు గర్వం గొంతులో తొణికిసలాడుతూండగా. ◆